# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**

క్రైస్తవ మాసపత్రిక

# గమనిక

క్రైస్తవ కీర్తన పుస్తకము తిరిగి ముద్రించబడి మావద్ద దొరుకుచున్నది. కొన్ని క్రొత్త కీర్తనలు చేర్చబడి అందముగా ప్లాస్టిక్ అట్టతో బైండింగ్ చేయబడినది. పుస్తకము ఖరీదు రూ. 6/- మాత్రమే. ఆర్డినరీ పోస్టేజీ 0-50 పైసలు అదనం. రిజిష్టర్ పోస్టులో కావలసినవారు ఇంకో రూ. 5/- పంపించాలి. కీర్తన పుస్తకములు V.P.Pలో పంపబడవు. వలయువారు ఈ దిగువ చిరునామాకు M.O. ముందుగా పంపి పొందండి:

**SATYAVANI**
P. O. Box. 80, Kakinada
A. P. - 533 001.

రాజన్ ఎలక్ట్రిక్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్యం

**THE WORD OF TRUTH**

**P.O. Box 80, KAKINADA, A.P. 533 001**

**Editor :** **J. C. CHOATE**

**Managing Editor :** **JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంచిక 11 జూన్ 1987 సంపుటి 7

## సంపాదకీయము

## నిన్ను నీవే నిగ్రహించుకో

*(Control Yourself)*

కారు, బస్సు, రైలు, విమానం మొదలగు వాహనము ఏదైనా అదుపు తప్పితే చాల ప్రమాదమని మనం ఎరుగుదుము. ఒక్కొక్కసారి ఒక వ్యక్తి వేడెక్కిపోతాడు, కోపపడతాడు, తన మానసిక శక్తిని కోల్పోతాడు. నిగ్రహాన్ని కోల్పోయిన అతని క్రియల వలన ఒకరిద్దరు గాయపడవచ్చు లేదా ప్రాణాలను కోల్పోవచ్చు. నిజానికి మానవునితో సహా ఏదైనా సరే అదుపు తప్ప వచ్చు. అందువలన మనలను మనమే నిగ్రహించుకొనడం నేర్చుకోవాలి. తద్వారా మనము ఎట్టి పరిస్థితిలో యున్నను ఎల్లప్పుడు సరియైన దానినే చేయ గలుగుదుము.

### నిగ్రహించుకోవలసిన కొన్ని సంగతులు :

1. మన తలంపులను అదుపులో యుంచుకోవాలి. ఒకడు నిజానికి క్రియ చేసినప్పుడే తప్పు చేసాడని కొందరు తలస్తారు. అయితే

ఆ క్రియ దేనివలన సంభవించినది? అది హృదయములో ఆరంభిస్తాది. యేసు ఇట్లు చెప్పాడు: "నోటినుండి బయటికి వచ్చునవి హృదయములోనుండి వచ్చును; ఇవే మనుష్యుని అపవిత్ర పరచునని మీరు ఎరుగరా? దురాలోచనలు నరహత్యలు వ్యభిచారములు వేశ్యాగమనములు దొంగతనములు అబద్ధ సాక్ష్యములు దేవదూషణలు హృదయములోనుండియే వచ్చును. ఇవే మనుష్యుని అపవిత్ర పరచును" (మత్త 15:18, 19). "వ్యభిచారము చేయవద్దని చెప్పబడిన మాట మీరు విన్నారుగదా; నేను మీతో చెప్పున దేమనగా ఒక స్త్రీని మోహపు చూపుతో చూచు ప్రతివాడు అప్పుడే తన హృదయమందు ఆమెతో వ్యభిచారము చేసినవాడగును" (మత్తయి 5:27, 28). "తన సహోదరుని ద్వేషించువాడు నరహంతకుడు; ఏ నరహంతకుని యందును నిత్యజీవ ముండదని మీరు ఎరుగుదురని" యోహాను చెప్పాడు (1 యోహా 3:15). ఒకని హృదయాలోచనలను బట్టి మనుష్యుడు ఉంటాడని సొలొమోను చెప్పాడు. ఈ లేఖనములను బట్టి ఒకని హృదయములో జరిగే దానిని బట్టి ఆ మానవుని ఆత్మయొక్క క్షేమము ఆధారపడి యుంటాదని మనము గ్రహించుకోగలము. అందువలన ఒకని తలంపులు సరియైన విధంగా అదుపులో యుంచబడాలి. తత్ఫలితంగా మానవుని హృదయం చెడుపనులకు గాక మంచిపనులకు వినియోగించబడతాది.

2. మన నాలుకను అదుపులో యుంచుకోవాలి: యాకోబు తన పత్రికలో నాలుకనుగూర్చి హెచ్చరించాడు. గుర్రములు మనకు లోబడుటకై వాటికి కళ్లెము పెట్టుదుము. పెద్ద ఓడలు చిన్నదగు చుక్కానిచేత త్రిప్పబడును. "అలాగుననే నాలుక కూడా చిన్న అవయవమైనను బహుగా అదిరిపడును. ఎంత కొంచెము నిప్పు ఎంత విస్తారమైన అడవిని తగులబెట్టును?" (యాకో 3:5, 6). మనము మృగ పక్షి సర్ప జల చరములను సాధు చేయగలము గాని "యే నరుడును

నాలుకను సాధు చేయనేరడు, అది మరణకరమైన విషముతో నిండినది. అది నిరర్గళమైన దుష్టత్వమే, దీనితో తండ్రియైన ప్రభువును స్తుతింతుము, దీనితోనే దేవుని పోలికగా పుట్టిన మనుష్యులను శపింతుము. ఒక్క నోటినుండియే ఆశీర్వచనమును శాపవచనమును బయలు వెళ్లును; నా సహోదరులారా, యీలాగుండకూడదు" (యాకో 3:8-10). చివరిగా అతడిట్లనుచున్నాడు: "నీటిబుగ్గలో ఒక్క జెల నుండియే తియ్యని నీరును చేదు నీరును ఊరునా? నా సహోదరులారా అంజూరపు చెట్టున ఒలీవ పండ్లయినను ద్రాక్ష తీగెను అంజూరపు పండ్లయినను కాయునా? అటువలె ఉప్పు నీళ్ళలో నుండి తియ్యని నీళ్లును ఊరవు. మీలో జ్ఞాన వివేకములు గలవాడెవడు? వాడు జ్ఞానముతో కూడిన సాత్వికము గలవాడై తన యోగ్య ప్రవర్తన వలన తన క్రియలను కనుపరచవలెను" (యాకోబు 3: 11-13).

యాకోబు 1:26, 27లో అతడిట్లనుచున్నాడు: "ఎవడైనను నోటికి కళ్లెము పెట్టుకొనక తన హృదయమును మోసపరచుకొనుచు భక్తి గలవాడనని అనుకొనినయెడల అతని భక్తి వ్యర్థమే. తండ్రియైన దేవుని యెదుట పవిత్రమును నిష్కళంకమైన భక్తి యేదనగా - దిక్కులేని పిల్లలను విధవరాండ్రను వారి యిబ్బందిలో పరామర్శించుటయు, ఇహలోక మాలిన్యము తన కంటకుండ తన్ను తాను కాపాడుకొనుటయునే". మాటలోను క్రియలోను కూడ విశ్వాసులకు మాదిరిగా యుండుమని పౌలు తిమోతికి చెప్పాడు. మనం చెప్పేదాన్ని జాగ్రత్తగా గమనించుకోవాలి. నాలుక మంచి కొరకు చెడ్డ కొరకు కూడ వినియోగింపబడ్తాది. అది సత్యాన్ని చెప్పగలదు, దేవుని స్తుతించగలదు, ప్రార్థించగలదు, క్రీస్తును ఒప్పుకోగలదు, సువార్త ప్రకటించగలదు, ఇతరులను గూర్చి మంచి చెప్పగలదు.

3. శరీరాశలను మనము అదుపులో యుంచుకోవాలి. శరీరాశ. జారత్వము, వ్యభిచారములయందు ఈ లోకము మునిగియున్నది,

వీటిలో కొన్నింటిని పౌలు కొరింథు సంఘములో కనుగొన్నాడు, వాటిని ఖండించాడు. భక్తిగల సభ్యులు అట్టి వారినుండి వైదొలగాలని హెచ్చరించాడు (1 కొరింథి 5). మనము శరీరాశలను విసర్జించాలని హెచ్చరించాడు (1 పేతురు 2:11).

4. తినే అలవాట్లను అదుపులో యుంచుకోవాలి: అనేకులు స్థూలకాయులై యున్నారు. వారు కావలసినదానికన్నా ఎక్కువ భుజించుటవలన అట్లగుదురు. "నీవు చనిపోయేవరకు తినుము త్రాగుము సుఖించుమని" ఈ లోకము తలస్తాది. ఎక్కువ తినేవారు సాధారణంగా ఆకలిగొన్న వారిని గూర్చి ఆలోచింపరు. తీర్పునాడు అట్టి వారితో క్రీస్తు, "నేను ఆకలిగొంటిని మీరు నాకు భోజనము పెట్టలేదు; దప్పిగొంటిని మీరు నాకు దాహమియ్యలేదని" చెప్పును (మత్త 25:42). మనదైనికావసరముల కొరకు విపరీతముగా మనము చింతించరాదు, ఏలయనగా ఆయన వాటిని మన కనుగ్రహిస్తాడని క్రీస్తు చెప్పాడు (మత్త 6). మనము కోరుకొన్న వాటన్నిటినీ ఆయన ఇయ్యడు గాని మనకు సరిపడినంత ఆయన యిస్తాడు.

5. మన డబ్బును అదుపులో యుంచుకోవాలి: డబ్బు నెట్లు వినియోగించాలో అనేకులకు తెలియదు. ఆదాయముకంటే వారి ఖర్చెక్కువ. కొందరు డబ్బు అప్పు తీసుకొంటారు గాని తిరిగి యివ్వరు. పౌలు ఇట్లనుచున్నాడు: "ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము; కొందరు దానిని ఆశించి విశ్వాసమునుండి తొలగిపోయి నానా బాధలతో తమ్మును తామే పొడుచుకొనిరి" (1 తిమో 6:10). పెద్దగా యుండగోరువాడు ధనాపేక్షలేనివాడై యుండాలి (1 తిమో 3:3). డబ్బులో స్వతహాగా దోషమేమియు లేదు. గాని దానికున్న శక్తి లేదా దానితో చేయగల సంగతులలో దోషమున్నది. అయితే దానితో మంచి కార్యములు కూడ చేయవచ్చు, ఒకని కుటుంబ అవసరాలు తీర్చుకోవచ్చు, అప్పులు తీర్చవచ్చు, పేదలకు అన్నదా

నము చేయవచ్చు, అభివృద్ధి జెందిన కొలది ప్రభువుకు కానుకల నీయ వచ్చు (1 కొరింథి 16:2).

6. కుటుంబ సభ్యులను మనము అదుపులో యుంచుకోవాలి. వారు మనకు చెందినవారు, మన ప్రతినిధులు. అందువలన వారు సరిగా ప్రవర్తించాలి, పెద్దగా యుండువాడు సంపూర్ణ మాన్యత కలిగి తన పిల్లలను స్వాధీనపరచుకొనుచు తన యింటివారిని బాగుగా ఏలువాడునై యుండవలెనని పౌలు చెప్పాడు (1 తిమో 3 : 4). ఒకడు తన యింటి వారిని ఏలనేరక పోయినయెడల అతడు దేవుని సంఘము నేలాగు పాలించును? (1 తిమో 3:5). భర్త భార్యకు శిరస్సై యున్నాడు. భార్య పిల్లలు అతనికి లోబడి యుండాలి. భర్త నిరంకుశుడును, కఠినుడును గాక అతడు తన కుటుంబాన్ని ప్రేమించాలి, వారు అతని ప్రేమించాలి, యిది ఆదర్శ కుటుంబ ఏర్పాటు.

7. మన ఆత్మీయ జీవితాన్ని మనం అదుపులో యుంచుకోవాలి. అనేకులు తాము నమ్ముచున్నదేమిటో ఎరుగరు; వారేమి చేయాలో ఎందుకు చేయాలో మొదలగు సంగతుల నేమీ ఎరుగరు. ప్రభువు మనందరికి తగిన జ్ఞానం యిచ్చాడు. గనుక ఆలోచించడానికి, యోచించడానికి, ఎంచుకోడానికి మనకు శక్తి యున్నది. తెలివిగల వారమైతే ప్రభువు వాక్యమును తెరచి ఆయన చెప్పు రీతిగ చేయుదుము. అట్లు చేయుటలో ప్రభువు సంఘములో చేర్చబడుదుము. క్రీస్తులో యుండి సంకుచిత మార్గమున నడుస్తూ, ప్రభువును ఆరాధిస్తూ ఆయనతోను, తోడి మానవులతోను సమాధానము కలిగి యుందుము. రాబోవు లోక నిరీక్షణను కలిగి యుందుము. నీ జీవితాన్ని నీవు అదుపులో యుంచుకో, దేవుడు నిన్ను దీవిస్తాడు.

చివరిగా నీ జీవితంలో ఆయా సంగతులను అదుపులో పెట్టావా? నీ గృహంలో, క్రీస్తుతో కూడిన నీ ఆత్మీయ జీవితంలో? లేనియెడల

వీటిని యిప్పుడే ఆచరణలో పెట్టుట మంచిది. అవి చాల ప్రాముఖ్య మైనవి గనుక వాయిదా వేయొద్దు.

తమ జీవితాలను అదుపులో యుంచుకొన్నవారు తేటగా కన బడతారు. వారు దేవునికి చెందినవారు, సహజంగా మంచిగా జీవిస్తారు, మంచి కుటుంబము కలిగి భవిష్యత్తును గూర్చి సంతోషము కలిగి యుంటారు. వారిని దేవుడు ఆశీర్వదించుచున్నాడు, వారు యితరులకు ఆశీర్వాదకరముగా యుంటారు. నీవు సహాయము కొరకు ప్రభువు తట్టు తిరిగిన యెడల నీవు కూడ అట్టి జీవితాన్ని కలిగి యుండగలవు.

---

## సువార్తను వినుట

## *(Hearing the Gospel)*

ఒకని విశ్వాసము అతడు వినిన దానిని బట్టి స్థిరపరచబడును. ఒకడు తప్పుడు బోధలను వినిన యెడల ఆ తప్పుడు బోధను నమ్ముట సాధ్యము. ముఖ్యముగా అతడు లేఖనములను వెదుకకుండగను, సత్య మును నేర్చుకొనవలెనని ప్రయత్నించకను యుండిన యెడల తప్పుడు బోధను నమ్ముట సాధ్యము. అతడు సత్యమును వినిన యెడల సత్యము నందు నమ్మిక యుంచుట జరుగును. ఇందువలననే స్వచ్ఛమైన దేవుని వాక్యమును వినుట ముఖ్యము. "కాగా వినుటవలన విశ్వాసము కలుగును; వినుట క్రీస్తును గూర్చిన మాట వలన కలుగును" అని పౌలు రోమా 10:17 లో చెప్పెను. వినుటను గూర్చి నొక్కి పలు కుట ఇచట గుర్తించుము. ఏదైనా వినుట కాదుగాని స్వచ్ఛమైన నిజ విశ్వాసము పొందునట్లు దేవుని వాక్యమును వినుట యెత్తి పలుక బడెను.

ఒకని విశ్వాసము దేవుని వాక్యముపై ఆధారపడినదో లేదో యని ఒకడు ఎట్లు రూఢిపరచుకొనును యను ప్రశ్న బయలుదేరును.

దేవుని పేరట ఈనాడు అనేకమైన విషయములు బోధింపబడు చున్నవి., మరియు అనేకమైన విషయములు బైబిలు గ్రంథము నుండి తెలియపర్చబడినవి యని చెప్పబడుచున్నవి. వీటిలో చాలా విరుద్ధముగా యున్నవి. అందుచేతనే చీలికయును తారుమారును ఇచట యున్నది. ఒకడు సత్యమును వినినాడా లేదా యని ఒకడు ఎట్లు తెలిసికొనును? దీనికి ఉత్కృష్టమైన మార్గము బైబిలువద్దకు పోవుటయే. ఒక మనుష్యుని యెడల ఎంత ప్రేమ, గౌరవము ఉన్న ప్పటికిని అతని బోధలు, ప్రకటనలు ఆఖరువిగా తీసుకొన కూడదు. మన యాత్మలు మిక్కిలి విలువగలవి, నిత్యజీవము అనంతమైనది కావున మన విశ్వాసము మన రక్షణ మానవమాత్రుల పాఠములపై ఆధార పడకూడదు. మనము సత్యముయొక్క ఉత్పత్తి స్థానము యొద్దకు పోవలెను. అట్టి స్థానము బైబిలు గ్రంథమే. ఒకసారి మనము బైబిలు గ్రంథమువైపు తిరిగిన యెడల మనము దానిని చదివి, పరిశీ లించి, లేఖనములను వెదకి మనము సరియైన మార్గమందున్నామని రూఢి పర్చుకొనవలెను. అట్లు లేనియెడల మనము సరిచేసుకొనవలెను. "లేఖనములయందు మీకు నిత్య జీవము కలదని తలంచుచు వాటిని పరి శోధించుచున్నారు, అవే నన్ను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నవి" యని క్రీస్తు చెప్పెను (యోహాను 5 : 39). పౌలు బోధించిన తర్వాత బెరయవారిని గురించి చదువుము: "వీరు థెస్సలోనికలో యున్న వారి కంటె ఘనులై యుండిరి. గనుక ఆసక్తితో వాక్యమును అంగీక రించి, పౌలును, సీలయు చెప్పిన సంగతులు ఆలాగున్నవో లేవో యని ప్రతి దినమును లేఖనములు పరిశోధించుచు వచ్చిరి" (అ.కా. 17 : 11). ఇపుడు దీనినిగూర్చి ఆలోచించుము! పౌలు బోధించిన తరు వాత అతడు సత్యమును బోధించెనో లేదో యని వారు దేవుని వాక్య మును పరిశోధించిరి. పౌలు కాలములోని వారే అతని బోధలనుగూర్చి లేఖనములను పరిశోధించిన యెడల మనము ఈ ఆధునిక బోధకులను

పరిశోధించసలెను. ప్రతివాడు ఇట్లు చేసిన ఎంత ఆశ్చర్యకరమైన సంగతి? ఇట్లు జరుగుచుండిన యెడల ఎట్టి విధమైన మత సంబంధమైన తప్పు యుండదు. మరియు తప్పుడు బోధకులు తక్కువై పోదురు.

పౌలు తిమోతియను యౌవనస్థుడైన బోధకుని దేవుని వాక్యము పరిశీలించుమని హెచ్చరించెను. పౌలు మాటలు వినుము: "దేవుని యెదుట యోగ్యునిగాను, సిగ్గుపడనక్కరలేని పనివానిగాను, సత్య వాక్యమును సరిగా ఉపదేశించువానిగాను నిన్ను నీవే దేవునికి కను పరచుకొనుము" (2 తిమోతి 2 : 15). అనేకులు ఎందువలన దేవుని వాక్యమును ఎరుగనివారై యున్నారు? ఎందుకనగా వారు లేఖనము లను పరిశోధించలేదు. ఎందుచేత అనేకులు మతప్రసక్తిలో మోస పోయిరి? ఎందుకనగా సత్యమునకును అసత్యమునకును మధ్య వివక్షత తెలుసుకొనుటకు వారు లేఖనములను పరిశోధించలేదు. ఎందువలన అనేకులు మోషే ధర్మశాస్త్రమును క్రీస్తు ధర్మశాస్త్రమును గూర్చి తారుమారగుచున్నారు? ఇచట కూడా ఆ కొదువయే-వారు దేవుని వాక్యమును పరిశోధించి సరియైన విధముగ విభజించుకొనక పోవుటయే. నా స్నేహితులారా, అపొస్తలుడైన పౌలు ఒక యౌవనస్థుడైన సువార్త సేవకుని దేవుని వాక్యము పఠించుమని హెచ్చరించినపుడు, ఆ విధముగా చేయుట నీకును నాకును ఎంత అవసరము?

"ప్రియులారా, అనేకులైన అబద్ధ ప్రవక్తలు లోకములోనికి బయలువెళ్ళి యున్నారు గనుక ప్రతి ఆత్మను నమ్మక, ఆయా ఆత్మలు దేవుని సంబంధమైనవో కావో పరీక్షించుడి" యని యోహాను ఆ కాలపు క్రైస్తవులను హెచ్చరించెను (1 యోహాను 4:1). ఇచట అపొస్తలుడు ప్రతి ఆత్మను, ప్రతి బోధకుని నమ్మవద్దు, ఎందుకనగా అనేక అబద్ధ ప్రవక్తలు, బోధకులు లోకములోనికి బయలు వెళ్ళిరి యని ప్రజలను హెచ్చరించెను. ఒకడు నిజమైనవాడో, అబద్ధికుడో మనమెట్లు తెలిసికొనగలము? వారిని పరీక్షించుము అని సలహా యిచ్చు

చున్నాడు. ఎట్లు పరీక్షించగలము? వారి బోధలను, ప్రచారములను దేవుని వాక్యముతో సరిపోల్చుట ద్వారా తెలిసికొనగలము. ఇది చేసినయెడల ఎవరు సత్యమును బోధించుచున్నారో, ఎవరు బోధించుట లేదో చెప్పగలము.

ఫిలిప్పు రథములో నపుంసకుని కలసికొనినపుడు అతడు లేఖనములను చదువుచుండెను. అప్పుడిట్లు వ్రాయబడినది: "అందుకు ఫిలిప్పు నోరు తెరచి, ఆ లేఖనములను అనుసరించి అతనికి యేసును గూర్చిన సువార్త ప్రకటించెను" (అ.కా. 8 : 35). దాని ఫలితముగ స్వచ్ఛమైన విశ్వాసము అతని హృదయములో నుద్భవించి ప్రభువునకు విధేయుడాయెను. అ.కా. 8 : 5లో ఫిలిప్పు సమరయ పట్టణము పరకు వెళ్ళి క్రీస్తును వారికి ప్రకటించుచుండెను అని వ్రాయబడెను. ఆ తరువాత పేతురు, యోహానులు సమరయుల ప్రదేశములను దర్శించి సువార్తను ప్రకటించుచు యెరూషలేమునకు తిరిగి వెళ్ళిరి యని వ్రాయబడెను (అ.కా. 8 : 25). ఇచట వారి బోధలు క్రీస్తు మీదను, దేవుని వాక్యము మీదను ఆధారపడియున్నట్లు గ్రహించుము.

మనము సువార్తను వినుటకు రెండు మార్గములు కలవు. మొదటిగా, ఇంతకు ముందు చెప్పినట్లు మనకు మనమే దేవుని వాక్యమును పరిశీలించగలము. అట్లు చేయుటలో క్రీస్తు, పౌలు, పేతురు, మిగిలిన దైవజనుల మాటలను ఆత్మావేశముచే వ్రాయబడిన దైవ గ్రంథముద్వారా వినుటకు అవకాశమున్నది. ఈ ఆధునిక యుగములో కూడా మనుష్యులందరు చదువు నేర్చినవారు కారు అనగా వారు నోటితో బోధింపబడు దేవుని వాక్యమును వినుటపై ఆధారపడవలెను. ఇట్టిచోట్ల ఇద్దరు భాగస్వాములు ఉంటున్నారు: బోధకుడు, వినువాడు. ఇట్టి కారణము వలననే దేవుని వాక్యమును బోధించుటకు ఎన్నుకొనిన వానిపై గురుతర బాధ్యత యుంచబడెను. అతడు దైవ గ్రంథములోని

సత్యమునే చెప్పవలెను. అతడు దేవుని వాక్యమును అజాగ్రత్తగను, మోసకరముగను, ఒకనిని పెడత్రోవను పెట్టించినట్లును బోధించిన యెడల దాని పరిణామములకు అతడే శిక్షను పొందును. భేదములను, ఆటంకములను కలుగజేయుచు మంచి మాటలతోను, చక్కటి ప్రసంగములతోను అమాయక హృదయములను మోసపుచ్చి విభేదములు కలుగజేయువారి విషయములో జాగ్రత్తపడుడి యని పౌలు రోమీయులను హెచ్చరించెను (రోమా 16 : 17, 18). ఒకడు వినునది సత్యమని అంగీకరించక ముందు అది సత్యమని రూఢి పరచుకొనవలసిన బాధ్యత వినువానికి కలదు. దేవుని వాక్యము చదువు శక్తి గలవారు లేఖనములను వారే పరిశోధించుకొనవలెను. చదువ శక్తి లేనివారికి ఈ సమస్య తీవ్రతరమగును. వారేమి చేయగలరు? సత్యమును తెలిసికొనుచున్నామని రూఢిపరచుకొనుటకు ఎవరో యొకరితో దేవుని వాక్యము నుండి చదివించుకొనవలెను. సత్యమును నిజముగా తెలిసికొనవలెనని ఏదో యొక మార్గము తప్పక యుండును.

మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి యని ప్రభువు శిష్యులకిచ్చిన యాజ్ఞ ప్రకారము ప్రతియొక్కడు సువార్త వినుట అవసరమై యున్నది (మార్కు 16:15). అది సమస్త జనులకు బోధింపవలెనని వ్రాయబడెను (మత్తయి 28 : 19). కాని ఎందుకు ఇట్లు బోధించవలెను? మానవజాతి యంతయు సువార్తను, సత్యమును, దేవుని వాక్యమును విని, దానిని నమ్మి, దానికి విధేయులై రక్షణ పొందుటకు "నిన్నుగూర్చియు, నీ బోధనుగూర్చియు జాగ్రత్త కలిగి యుండుము. వీటిలో నిలకడగా యుండుము. నీవిలాగు చేసి నిన్నును నీ బోధ వినువారిని రక్షించుకొందువు" అని పౌలు తిమోతికి వ్రాసెను (1 తిమోతి 4 : 16). ఒకడు వినుటద్వారా ఎట్లు రక్షణ పొందగలడు? ఇంతకు ముందు నొక్కి చెప్పినట్లుగా, వినుట వలన విశ్వాసము కలుగును. మరియు విశ్వాసమునకును, విధేయతకును దారి

తీయును, విధేయత రక్షణను అనుగ్రహించును. ఇదియే పౌలు బోధించునది.

అపొస్తలుల కార్యములలో మార్పు జెందినవారి సందర్భములను చదివిన ఒక సువార్త బోధకుడు ప్రతి సమయమందును యుండుట గమనించెదవు. అతని పని యేమి? రక్షించబడగోరు వారికి సువార్తను ప్రకటించుటయే. కావున వారు సువార్తను విని, దానిని నమ్మి, దానికి విధేయులైనపుడు వారు రక్షింపబడిరి. వారికి దేవుని వాక్యమును విను అవకాశము లేకపోయిన యెడల ఏమగును? వారు రక్షణ పొంది యుండలేరు. ఏలయనగా దేవుని వాక్యమును వినుట వలన విశ్వాసము కలుగును. విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడై యుండుట అసాధ్యము (హెబ్రీ 11 : 6).

రూపాంతర సమయములో ఆయన కుమారుడైన యేసును గూర్చి దేవుడిట్లు చెప్పెను: "ఇదిగో, ఈయన నా ప్రియ కుమారుడు, ఈయనయందు నేనానందించుచున్నాను, ఈయన మాట వినుడి" (మత్తయి 17 : 5). తన కుమారుడైన యేసు ద్వారా ఈ దినము దేవుడెట్లు మాట్లాడుచుండెనో మనము గ్రహించి యున్నాము (హెబ్రీ 1 : 1, 2). ఆఖరుగా క్రీస్తు వాక్యమై యున్నాడని మనము చదువుచున్నాము (యోహాను 1 : 1, 2). కావున మనలను రక్షించుటకు వచ్చిన క్రీస్తును విని ఆయనకు విధేయులగుట చాలా ప్రాముఖ్యము. మానవుడు చెప్పినది మరచిపొమ్ము. అతని అభిప్రాయములు, ఉద్దేశములు, బోధలు అన్నియు ప్రభువు చెప్పిన వాటిముందు బహు తక్కువ విలువ గలవి. మనము క్రీస్తును వినవలెను. క్రీస్తును మనము నమ్మవలెను. క్రీస్తుకు మనము విధేయులై యుండవలెను.

ఆఖరుగా యాకోబు ఇట్లు వ్రాసెను. "మీరు వినువారు మాత్రమైయుండి మిమ్మును మీరు మోసపుచ్చుకొనకుండ వాక్య

ప్రకారము ప్రవర్తించువారై యుండుడి" (యాకోబు 1:22). స్వచ్ఛమైన దేవుని వాక్యమును వినుట అంత ప్రాముఖ్యమై యున్నందున దానిని వినుట మాని నశించిపోవుట సాధ్యము. కనుక మనము వాక్య ప్రకారము చేయువారముగా యుండవలెననియు, వినువారుగా నుండవద్దనియు హెచ్చరింపబడితిమి. ఇది జ్ఞాపక ముంచుకొనుట మనకు మంచిది.

జె. సి. ఫోట్.

---

## వినినవారి విశేషాసక్తి

సువార్త ప్రకటన యను వెర్రితనముచేత నమ్మువారిని రక్షించుట దేవుని దయాపూర్వక సంకల్పమాయెను (1 కొరి 1 : 21).

అపొ. పేతురు ప్రసంగము వినిన వేలకొలది హృదయములు నొచ్చుకొని సహోదరులారా మే మేమి చేతుమని అడిగి ఆ సమయము లోనే యేసుక్రీస్తులోనికి పాపక్షమాపణ కొరకు బాప్తిస్మము పొంది అపొస్తలుల సహవాసములో నిలకడగా ఉండిరి (అ.కా. 2 : 37-42).

అపొ. పౌలు వాక్యము ప్రసంగించుచుండగా బెరయవారు ఆసక్తితో అనుదినము లేఖనములను పరిశోధించుచు వాక్యమును విశ్వసించి అంగీకరించిరి (అ.కా. 17 : 11-12). సువార్తికుడైన ఫిలిప్పు బోధను వినుచున్న ఐతోపీయుడైన నపుంసకుడు తన్ను తాను పరీక్షించుకొనుచు వాక్యమునకు విధేయుడై నీళ్ళను కనుగొని వెంటనే పాపక్షమాపణ కొరకు బాప్తిస్మము పొందెను (అ.కా. 8:35-39).

## మరికొంపరి ప్రతికూలత

స్తెఫను చెప్పుచున్న దైవోక్తులను యూదులు విని కోపముతో మండిపడి పండ్లు కొరుకుచు, పెద్ద కేకలు వేసి చెవులు మూసికొని యేకముగా అతనిమీద పడి రాళ్లు రువ్వి చంపిరి (అ.కా. 7:54-58).

పరి. పౌలు ప్రసంగము వినిన ఫేలిక్సు మిగుల భయపడి ఇప్పటికి వెళ్లుము, తరువాత నిన్ను పిలిపించెదనని చెప్పెను. (అ. కా. 24 : 24-25).

అపొ. పౌలు ప్రసంగము వినుచున్న ఏథెన్సు వారు కొందరు అపహాస్యము చేసిరి. (అ. కా. 17 : 32).

వారు వినిన వారితో విశ్వాసము గలవారై యుండలేదు గనుక విన్న వాక్యము వారికి నిష్ప్రయోజనమైనదాయెను (హెబ్రీ 4 : 2).

## నేటి సేవకుల సేవలో

అవును క్రీస్తు దాసుడు, క్రీస్తు సువార్త ప్రకటించుచున్నపుడు ప్రశంసించేవారు కొందరైతే ప్రతిఘటించేవారు అనేకులు.

వారి పితరులు ప్రవక్తలను ద్వేషించి వెలివేసి నిందించి పేరు చెడ్డదని కొట్టివేసిరి, అబద్ధ ప్రవక్తలను కొనియాడిరి (లూకా 6:21-26).

ఎందుకనగా జనులు హితబోధను సహింపక, దురద చెవులు గలవారై తమ స్వకీయ దురాశలకు అనుకూలమైన బోధకులను తమకొరకు పోగుచేసికొని సత్యమునకు చెవి ఇయ్యక కల్పనా కథల వైపునకు తిరుగు కాలము వచ్చును. (2 తిమో 4 : 3-4).

క్రీస్తు సేవకుడు, క్రీస్తు దినమున కలుగు బహుమానము కొరకైన గురితో క్రీస్తు వాక్యము ప్రకటించవలెను. ధనాపేక్షను కప్పిపుచ్చే వేషముతో గాని, మనుష్యుల మన్ననలు కోరి గాని, తాను బోధించునది తాను గ్రహించకయే ఉపదేశకుడుగా నియమించుకొనుట గాని తగదు. అట్టివారు బాహ్యంగా బాగా వృద్ధి చెందుచున్నను క్రీస్తు దినమందు నిష్ఫలులగుదురు (1 కొరి 4:1, ఫిలిప్పీ 2:16, 1 థెస్స 2:5, 6, 1 తిమో 1:6-7).

లోకమునకు అవసరమైన రక్షణ సందేశము, క్రీస్తు సంఘము నకు అవసరమగు ఆత్మీయ జీవిత విధము, ఆరాధనక్రమము క్రీస్తు దినమందు కలుగు బహుమానము, లేక ప్రతిదండన క్రొత్త నిబంధన నుండి అనగా 27 పుస్తకములనుండి మాత్రము నేర్చుకొనగలము.

ప్రతివారు మోసపోయి అపవాది ఉరిలో చిక్కుకొనకుండునట్లు పరిశుద్ధాత్ముడు అపొస్తలులచే సమస్త విషయములను, బోధను వివరముగా వ్రాయించెను. 2 పేతు 1 : 12-21.

## పరిశుద్ధాత్మ Vs భ్రమపరచు ఆత్మ

- క్రీస్తు సువార్త : భిన్నమైన సువార్త. గల 1:6,7, మరియొక సువార్త. గల 1 : 8
- క్రీస్తు బోధ : భిన్నమైనబోధ 1 యోహా 9, దుర్బోధ, 1 తిమొ 1:3, తీతు 2:15
- క్రీస్తు వాక్యము : మనుష్యుల వాక్యము కలిపిచెరిపేవాక్యం 2 పేతు 2:3, కొల 3:17, 1 థెస్స 2:13, 2 కొరి 2:17.
- క్రీస్తుదేవుని జ్ఞానము : మనుష్య జ్ఞానము, లోకజ్ఞానము దయ్యముల జ్ఞానము 1 కొరి 1:23-24, 2:6, 13; యాకో 3:15.
- క్రీస్తు ఆత్మ : మోసపరచు ఆత్మ, క్రీస్తు విరోధి ఆత్మ భ్రమపరచు ఆత్మ రోమా 8:9, 1 యోహా 4:2-3, 6.
- క్రీస్తు అపొస్తలులు : దొంగ అపొస్తలులు, 2 కొరి 11:13.
- క్రీస్తు దాసుడు : తమ కడుపునకే దాసుడు 1 కొరి 7:22, రోమా 16 : 18.

| | |
|---|---|
| ♦ క్రీస్తు పరిచారకుడు : | సాతాను పరిచారకుడు |
| | 2 కొరి 11:14-15, 23, |
| ♦ క్రీస్తు సంబంధులు : | అపవాది సంబంధులు |
| | గల 3:29, యోహా 8:44 |
| ♦ క్రీస్తు సంఘములు : | సాతాను సమాజము |
| | రోమా 16 : 16, ప్రక 2 : 9. |
| ♦ క్రైస్తవులు : | యూదులు |
| | అ. కా. 11:26, 1 థెస్స 2:15-16. |

ఈ దినాలలో అనేకులు బోధకులుగా ఉండి సంఘములను, సంస్థలను కట్టుచున్నారు గాని, సిద్ధాంతాలు మాత్రం వేరు వేరు. వారు పై వాక్యమును అనుసరించి ఎవరి సంబంధులో గమనించి అపొస్తలులు బోధించిన క్రొత్త నిబంధన ప్రకారం నిలువగలిగితే ఒక్క ఆత్మయందు ఒక్క అడుగుజాడలలో పోగలరు (2 కొరి 12 : 18).

—పాల్ గూటం, గొల్లవిల్లి.

---

# పరిశుద్ధాత్మ
## ( *The Holy Spirit* )

పరిశుద్ధాత్మను గూర్చి నేటికాలంలో అనేకమైన గందరగోళములును, తప్పుడు అభిప్రాయాలును ఉన్నాయి. అందుచేత ఈ అంశమును గూర్చి బైబిలు ఏమీ చెప్పుచున్నదో పరిశీలించుదము.

వివిధములగు అంశములను గూర్చి బైబిలు ఎట్లు విశదముగా బోధించెనో, అట్లే పరిశుద్ధాత్మను గూర్చియు బోధించెను. బైబిలు

నందు దేవుడును, క్రీస్తును, 'వ్యక్తిత్వము'లను కలిగియుండిరి. అట్లే పరిశుద్ధాత్మయు వ్యక్తిత్వమును కలిగియుండెనని బైబిలు బోధించుచున్నది. బైబిలునందు పరిశుద్ధాత్మ ఒక వ్యక్తికి కలిగియుండు లక్షణములతో ఉదాహరించబడెను. "ఆత్మ యొక్క మనస్సు" (రోమా 8:27) "ఆత్మ చెప్పుచున్నాడు" (1 తిమోతి 4:2) "పరిశుద్ధాత్మను దుఃఖ పరచకుడి" (ఎఫెసీ 4:30) మొదలగు పదములనుబట్టి పరిశుద్ధాత్మడు వ్యక్తిత్వమునకుండు లక్షణములను కలిగియున్నట్లుగా గ్రహించుచున్నాము. త్రిత్వములో ఒకడుగా పరిశుద్ధాత్ముడున్నాడు. మరియు తండ్రి కుమారునితో పరిశుద్ధాత్ముడు సమాన స్థాయిలో చూపబడినాడు. "కాబట్టి మీరు వెళ్ళి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి. తండ్రి యొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మ మిచ్చుచు. . . ." (మత్తయి 28:19).

## ఆత్మబాప్తిస్మము

అపొస్తలులు మాత్రమే పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిరి. అంతే కాని నూట ఇరువది మంది కాదు.

1. పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందుదురను వాగ్దానము అపొస్తలులకు మాత్రమే ఇయ్యబడెనని అపొస్తలుల కార్యములు మొదటి అధ్యాయము మొదటి అయిదు వచనములు చదువుట ద్వారా తెలిసికొందము.

2. అపొస్తలుల కార్యములు రెండవ అధ్యాయము మొదటి వచనమునందలి "అందరు" అను పదము, మొదటి అధ్యాయము ఇరువై ఆరు వచనములోని 'మత్తీయ'తో కలిపి మిగిలిన పదునొకండుగురిని సూచించుచున్నది.

3. అపొస్తలుల కార్యములు 1:4, 5 నందలి వాగ్దానము అపొస్తలులకు మాత్రమే ఇవ్వబడెను. "మీరు యెరూషలేము నుండి వెళ్ళక, నా వలన వినిన తండ్రియొక్క వాగ్దానము కొరకు కనిపెట్టుడి. యోహాను నీళ్ళతో బాప్తిస్మము ఇచ్చెను గాని కొద్ది దినములలోగా మీరు పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందెదరనెను".

4. యోహాను సువార్త నందలి వాగ్దానములు "ఆదరణకర్త అనగా తండ్రి నా నామమున పంపబోవు పరిశుద్ధాత్మ సమస్తమును మీకు బోధించి నేను మీతో చెప్పిన సంగతులన్నిటిని మీకు జ్ఞాపకము చేయును" (యోహాను 14:26). "నేను మీతో చెప్పవలసినవి ఇంకను అనేక సంగతులు కలవు గాని యిప్పుడు మీరు వాటిని సహింపలేరు. అయితే ఆయన సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు మిమ్మును సర్వసత్యములోనికి నడిపించును. ఆయన తనంతట తానే యేమియు బోధింపక, వేటిని వినునో వాటిని బోధించి సంభవింపబోవు సంగతులను మీకు తెలియజేయును. ఆయన నా వాటిలోనివి తీసుకొని మీకు తెలియజేయును గనుక నన్ను మహిమ పరచును".

5. ఆనాటి ప్రజలు హృదయములో నొచ్చుకొని మేమేమి చేతుమని అపొస్తలులను అడిగిరి? వారేల అపొస్తలులనే అడిగిరి? (అ.కా. 2-37). ఏలయనగా దేవుడు అపొస్తలులను పరిశుద్ధాత్మలో బాప్తిస్మమిచ్చుటద్వారా మిగిలిన శిష్యులనుండి వీరిని ప్రత్యేకపరచినందున.

6. అపొస్తలులు మాత్రమే పెంతెకొస్తు దినమున క్రీస్తు వాగ్దాన ప్రకారము పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందిరి. "పెంతెకొస్తను పండుగ దినము వచ్చినప్పుడు అందరు ఒక చోట కూడియుండిరి. అప్పుడు వేగముగా వీచు బలమైన గాలి వంటి యొక ధ్వని ఆకాశమునుండి అకస్మాత్తుగా, వారు కూర్చుండియున్న యిల్లంతయు నిండెను. మరియు అగ్ని జ్వాలలవంటి నాలుకలు విభాగింపబడినట్టుగా

వారికి కనబడి, వారిలో ఒక్కొక్కనిమీద వ్రాలగా అందరు పరిశుద్ధాత్మతో నిండినవారై ఆ ఆత్మ వారికి వాక్ శక్తిని అనుగ్రహించిన కొలది అన్యభాషలతో మాటలాడసాగిరి" (అ.కా. 2:1-4). పెంతెకొస్తు దినమున పేతురు, యోవేలు ప్రవచనమును (యోవేలు 2:28-32) ఎత్తి చెప్పుచు పరిశుద్ధాత్మ బాప్తిస్మము అన్యజనులు కూడా పొందుదురని చెప్పెను (అపొ. కా. 2:16-17).

## యోవేలు ప్రవచనము

యోవేలు ప్రవచన మేమనగా దేవుడు తన ఆత్మను సర్వ శరీరుల మీద కుమ్మరించును. పేతురు మాట ప్రకారము పెంతెకోస్తు రోజున జరిగిన సంఘటన యోవేలు ప్రవచనము నెరవేర్పుగా జరిగెను. అయితే "సర్వశరీరులు" అను మాట యూదులను అన్యులను కూడా సూచించుచున్నది. కాని పెంతెకోస్తు దినమున యూదులు మాత్రమే పరిశుద్ధాత్మలో బాప్తిస్మమును పొందిరి. కాబట్టి అటువంటి బాప్తిస్మమును అన్యులు రాబోవు కాలములో పొందవలసియున్నది. అన్యుడైన కొర్నేలి తన యింటివారును పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందుట ద్వారా (అపొ. కా. 10:34; 11:18) ఈ వాగ్దానము రెండవ భాగము నెరవేరెను.

కొర్నేలి తన యింటి వారును పరిశుద్ధాత్మ బాప్తిస్మమును పొందుటలో దేవుని యుద్దేశ్యమేమి?

సువార్త మొదటిగా యూదులకు మాత్రమే (మత్తయి 11:6) ప్రకటించబడెను. అన్యులలో ఆ సువార్త మొదటిగా కొర్నేలి వినెను (అపొ. కా. 10:1-8). కొర్నేలికి సువార్తను బోధించుటకు పేతురును దేవుడు అద్భుతముగా పంపించెను. పేతురు కొర్నేలికిని అతని యింటి వారికిని బోధించుచుండగా పరిశుద్ధాత్మ బాప్తిస్మమును దేవుడు వారికి అనుగ్రహించెను. (అపొ. కా. 10:44, 45).

## ఆత్మ బాప్తిస్మము ఎందుకు?

అపొస్తలులు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందుటలో ఉద్దేశ్యమేమి అని పరిశీలించినచో:

1. అపొస్తలులు పరిశుద్ధాత్మావేశముతో క్రీస్తును ప్రకటించుటకును, తప్పులు లేకుండా క్రొత్త నిబంధనను వ్రాయుటకును పరిశుద్ధాత్మ బాప్తిస్మం పొందిరి. "ఏలయనగా ప్రవచనము ఎప్పుడును మనుష్యుని, ఇచ్ఛను బట్టి కలుగలేదుగాని మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింపబడినవారై దేవుని మూలముగ పలికిరి". (2 పేతురు 1 : 21).

2. వారు అద్భుతములు చేయుటకు శక్తిని యిచ్చు నిమిత్తము పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందిరి. ఈశక్తి వారికి సూచనలగాను, చిహ్నములుగాను యుండి దేవునిచే ఎన్నుకొన బడిన వారని తెలుపుచున్నది. "సూచక క్రియలను అద్భుతములను మహాత్కార్యములను చేయుటవలన, అపొస్తలుని యొక్క చిహ్నములు పూర్ణమైన ఓరిమితో మీ మధ్యను నిజముగా కనుపరచబడెను" (2 కొరింథీ 12:12).

[ సశేషము ]

—యిసుకపట్ల ఇజ్రాయెల్, కాకినాడ.

---

## ద్రాక్షావల్లి మరియు తీగెలు
### (The Wine and the Branches)

అలంకార రీతిగా ఉపదేశించడం ప్రభువుకు యిష్టమైన ఒక పద్ధతి. సామాన్య జీవితంలో యదార్థతకు సమీపంగా యున్న ఈ వర్ణనలద్వారా తన పాఠములు అర్థమయ్యేలాగున ఆయన బోధించేవాడు. అందువలన "సామాన్య జనులు ఆయన మాటలను సంతోషముతో వినుచుండిరి" (మార్కు 12:37). అట్టి ఉపదేశములలో ఆయన

అప్పగింపబడక ముందు ద్రాక్షావల్లి దాని తీగెలను గూర్చి చేసిన ఉపదేశమొకటి. అది ఆత్మీయ సత్యమును బోధించుటకు ఉపదేశించబడినది:

“నేను నిజమైన ద్రాక్షావల్లిని, నా తండ్రి వ్యవసాయకుడు. నాలో ఫలింపని ప్రతి తీగెను ఆయన తీసి పారవేయును; ఫలించు ప్రతి తీగె మరి ఎక్కువగా ఫలింపవలెనని దానిలోని పనికిరాని తీగెలను తీసి వేయును. నేను మీతో చెప్పిన మాటలనుబట్టి మీరిప్పుడు పవిత్రులై యున్నారు. నా యందు నిలిచి యుండుడి, మీయందు నేనును నిలిచి యుందును. తీగె ద్రాక్షావల్లిలో నిలిచి యుంటేనే గాని తనంతట తానే యేలాగు ఫలింపదో, ఆలాగే నాయందు నిలిచియుంటేనే గాని మీరును ఫలింపరు. ద్రాక్షావల్లిని నేను, తీగెలు మీరు. ఎవడు నా యందు నిలిచియుండునో, నేను ఎవనియందు నిలిచియుందునో వాడు బహుగా ఫలించును. నాకు వేరుగా ఉండి మీరేమియు చేయలేరు. ఎవడైనను నాయందు నిలిచియుండని యెడల వాడు తీగవలె బయట పారవేయబడి యెండిపోవును. మనుష్యులు అట్టివాటిని పోగుచేసి అగ్నిలో పారవేతురు, అవి కాలిపోవును. నాయందు మీరును మీ యందు నా మాటలను నిలిచియుండిన యెడల మీకేది యిష్టమో అడుగుడి, అది మీకు అనుగ్రహింపబడును. మీరు బహుగా ఫలించుట వలన నా తండ్రి మహిమపరచబడును; ఇందువలన మీరు నా శిష్యులగుదురు” (యోహాను 15:1-8).

యేసుప్రభువు చెప్పిన ఈ సుందర దృశ్యములో, తన శిష్యులతో ఆయనకున్న సంబంధము చక్కగా వర్ణించబడినది. ఈ ఉపమానాలంకారములో క్రీస్తు బోధించిన కొన్ని పాఠములను గమనించుము :

## 1. ద్రాక్షావల్లి యజమాని దేవుడు

మొదటిగా, దేవుడు ద్రాక్షావల్లి యజమానియై యున్నాడు. “నేను నిజమైన ద్రాక్షావల్లిని, నా తండ్రి వ్యవసాయకుడు” అని

క్రీస్తు చెప్పాడు. జీవనాధారముగ దేవుడు క్రీస్తును ఈ లోకంలో నాటి, ఆయన ద్వారా తీగెలు దేవునితో సంబంధము కలిగి జీవము కలిగియుండునట్లు ఆయన నొక్కని మాత్రమే ద్రాక్షావల్లిగా చేసాడు. పాతనిబంధన ప్రవచనములను నెరవేర్చిన మెస్సీయ యేసు క్రీస్తు గనుక ఆయన నిజమైన ద్రాక్షావల్లియై యున్నాడు, అందు వలన దేవునియొద్దకు వెళ్లే మార్గము యేసుద్వారానే యున్నది. జీవముగల నిజమైన ద్రాక్షావల్లి ఆయన ఒక్కడు మాత్రమే.

ద్రాక్షావల్లియొక్క యజమాని దానిని సరిచేసి కత్తిరించి సాగుచేస్తాడు. యజమానియు సాగుచేయువాడైన దేవుడు తీగెలు బహుగా ఫలించాలని కోరుచున్నాడు. ఫలించు తీగెలు మరి ఎక్కువగా ఫలించునట్లు ఫలింపని తీగెలను ఆయన కోసి బయట పారవేయును. వాక్యముద్వారా ఈ పరిశుభ్రత జరుగును (శివ వచనము).

## 2. క్రీస్తుకును ఆయన శిష్యులకును మధ్య వ్యక్తిగత సంబంధమున్నది

రెండవదిగా, ద్రాక్షావల్లికిని తీగెలకును ఉన్న సంబంధము ్రీస్తుకును ఆయన శిష్యులకును ఉన్న సంబంధము ఒక్కటే. ప్రకృతి ్రపంచములో తీగెకు ద్రాక్షావల్లి యెట్టిదో, ప్రతిశిష్యునికి క్రీస్తు ట్టివాడు. తీగెలకు ద్రాక్షావల్లి ఆహారము సరఫరా చేయును. ండ్రితో ఏకమైన యేసు సమస్త జీవానికి ఆధారభూతుడు. ఆయన ిష్యులు పరిశుద్ధ ఫలము ఫలించునట్లు ఆయన సహాయము చేయును. ండోరుల సంబంధములో ద్రాక్షావల్లి తీగెలు ప్రముఖ ఏకత్వము లిగి ఏకమై యున్నవి. తీగెలు ద్రాక్షావల్లినుండి జీవమును పొందుచు ్రాక్షవల్లి యిచ్చు ఫలములనే యిస్తాయి. అట్లే క్రైస్తవులు శారీర ంగా గాక, ఆత్మీయముగా క్రీస్తుతో ఏకత్వము కలిగియున్నారు

(గల 2:20). వారు క్రీస్తు ద్వారా దేవునినుండి తమ జీవమును పొందుచు తండ్రితో ఏకమైయున్నారు.

పండ్లు ద్రాక్షావల్లిపై గాక ఎల్లప్పుడు తీగెలపైనే కాయును. అయితే ద్రాక్షావల్లికి వేరై తీగలు ఎన్నడు పండ్లుకాయవు. తీగెలు లేకుండా ద్రాక్షావల్లి ఫలములు ఫలించదు, ద్రాక్షావల్లి లేకుండా తీగెలు బ్రతుకవు. అట్టి పరస్పర సంబంధమే క్రీస్తుకు ఆయన అనుచరులకు మధ్య ఉన్నది. అందువలన "నేను ద్రాక్షావల్లిని మీరు నా తీగెలు" అని క్రీస్తు చెప్పాడు.

క్రీస్తు ద్రాక్షావల్లి అయ్యున్నాడు. వ్యక్తిగత క్రైస్తవులు తీగెలు. ద్రాక్షావల్లికి తీగలకున్నట్టి సంబంధమువలె క్రీస్తు శిష్యులకు క్రీస్తుకు మధ్య నున్న సంబంధమున్నది.

## 3. తీగెలు శిష్యులు గాని మతశాఖలు కాదు

మూడవదిగా, ఆయా డినామినేషన్లు సంఘము యొక్క శాఖలు కాదు. నేటిలోకములో యున్న ఆయా మతశాఖలన్నియు ద్రాక్షావల్లి యొక్క తీగెలని, అవన్నియు కలిసి నిజమైన సంఘ మగునని కొందరి భావన. అయితే "నేను నిజమైన ద్రాక్షావల్లిని, డినామినేషన్లన్నియు తీగెలని" క్రీస్తు చెప్పలేదు. "ద్రాక్షావల్లిని నేను, మీరు తీగెలని" ఆయన చెప్పాడు. తీగెలను మాట వివిధ మతశాఖలకు వర్తించదనుటకు కనీసం మూడు కారణాలున్నాయి:

మొదటిగా ద్రాక్షావల్లిని నేను అని యేసు చెప్పుసరికి నేడున్న మతశాఖలలో యేదియు లేదు. క్రీస్తు తరువాత కొన్ని వందల సంవత్సరములవరకు మతశాఖల తత్వము ఆరంభింపనేలేదు. తీగెలు లేకుండా ద్రాక్షావల్లి ఫలములు ఫలించి జీవము కలిగియుండలేదు. కొందరను కొనుచున్నట్లుగా మతశాఖలు గనుక తీగెలైతే అవి ఉద్భవించిన

కొన్ని శతాబ్దములవరకు సంఘము తీగెలు లేనిదై ఫలహీనమైనదై నిర్జీవమైన సంస్థవలె యున్నదన్నమాట! అయితే తీగెలను గూర్చి చెప్పినప్పుడు అవి మతశాఖలని క్రీస్తు యొక్క ఉద్దేశము కాదనునది విదితమే.

రెండవదిగా, ఒకే ద్రాక్షావల్లినుండి వందలకొలది, వేలకొలది తీగెలు వచ్చి, ఆ ఒక్కొక్క తీగెమీద వేర్వేరు ఫలములు ఫలించుట ప్రకృతి విరుద్ధము. అమెరికాలోనే 250 కంటె ఎక్కువ డినామినేషన్లు న్నవి. ద్రాక్షావల్లి యొక్క ఒక తీగె గుమ్మడికాయలు, మరొకటి దోసకాయలు ఇంకొకటి ద్రాక్షపండ్లు కాయునా? అట్టిది ప్రకృతి విరుద్ధముకాదా? అయితే ప్రకృతిలో ద్రాక్షావల్లి యొక్క ప్రతి తీగె ఒకే రకమైన ఫలములు ఫలించును. అయినను ద్రాక్షావల్లి యొక్క తీగెలు వివిధ ఫలములను ఫలించునని అంగీకరించని ప్రజలు నిజ ద్రాక్షావల్లియైన క్రీస్తులో యున్న ప్రతి తీగె ఒక డినామినేషనని చెప్పే వింతవర్ణనను అంగీకరిస్తారు. మతశాఖల తత్వాన్ని సమర్థించుటకు బైబిలులో ఎవనికీ యేమీ దొరుకదు. దేవుని దృష్టిలో చీలికలు పాపము. ఆదిమ సంఘము ఏకత్వము కలిగిన విశ్వాసుల సమాజము (యోహాను 17:20-23; 1 కొరింథీ 1:10-13; 12:12-27; ఎఫె 1 : 22, 23; 4 : 3,6). అపొస్తలుల కాలములో క్రైస్తవులు నేడున్న మతశాఖలలో దేనిలోను సభ్యులుకారు. వారు కేవలము ప్రభువు సంఘసభ్యులు. అందువలన అపొస్తలు డెవడును సంఘము యొక్క 'ఏశాఖను' సంబోధించలేదు.

మూడవదిగా, వివిధ డినామినేషన్లు తీగెలని క్రీస్తు వర్ణింప జేయలేదు ఏలయనగా ఆయన వ్యక్తిగత నామవాచకమగు 'మీరు' అను మాటను వినియోగించాడు. "ద్రాక్షావల్లిని నేను, తీగెలు మీరు" అని ఆయన చెప్పాడు. మరల, ఎవడైనను (ఏ మనుష్య

స్తైనను) నాయందు నిలిచి యుండని యెడల వాడు (ఆ మనుష్యుడు) తీగవలె బయట పారవేయబడి యెండిపోవును" అని ఆయన చెప్పాడు. ద్రాక్షాపల్లినుండి వచ్చిన తీగెలన్నియు ఆయన శిష్యులని యేసు పలికాడు. క్రీస్తుయొక్క శిష్యులు 'సంఘ శాఖ' యొక్క సభ్యులు కారు. ప్రజలే క్రీస్తుయొక్క తీగెలు లేక కొమ్మలు.

"నేను ఫలాని మతశాఖలో సభ్యుడనని" కొందరు చెబుతారు. "నాలో నిలిచియుండుడి" యని క్రీస్తు చెప్పాడు. డినామినేషన్లో సభ్యులు కాకుండ మొదటి శతాబ్దములో ప్రజలు క్రీస్తు సంఘ సభ్యులుగా ఉండగలిగిన యెడల, అప్పుడది సరియైతే ఇప్పుడెందుకు అది సరి కాదు? ఈనాడు ప్రజలు క్రొత్త నిబంధనను విశ్వసించి విధేయత చూపినయెడల అది వారిని క్రైస్తవులుగను క్రీస్తు శరీరములో సభ్యులుగాను మాత్రమే తయారుచేయును. క్షేమకరమైన మార్గ దర్శిగా క్రొత్త నిబంధన యుండగా, తాను క్రైస్తవుడను, క్రైస్త వుడనుగా మాత్రమే యుందునని మానవుడు నిశ్చయించుకొనవలెను. అతడు ఏ డినామినేషన్కు చెందకుండా సత్యాన్నంతటినీ విశ్వసించి విధేయత చూపగలడు. అతడు ఎప్పుడు ఏ డినామినేషన్కు చెందకుండా రక్షింపబడి పరలోకమునకు వెళ్ళగలడు. [సశేషము]

—పెర్రి బి. కోతమ్.

---

సంక్షిప్త ప్రసంగము :

## పా ప ము
## *(S I N)*

పరిచయము :

1. పాపమనగా యేమిటో అనేక భావాలున్నాయి.
2. మానవులు పాపానికి తమ స్వంత నిర్వచనాన్ని యిచ్చారు. పెద్ద పాపము, చిన్న పాపము అని వారు చెబుతారు.
3. పాపమును గూర్చిన సత్యం కొరకు బైబిలు నొద్దకు వెళ్లాలి.

## పాపమనగా యేమిటి?

1. ఆజ్ఞాతిక్రమమే పాపము. 1 యోహాను 3:4
2. సమస్త దుర్నీతియు పాపము. 1 యోహాను 5:17
3. విశ్వాస మూలము కానిది ఏదో అది పాపము. రోమా 14:23
4. మేలైనది చేయనెరిగియు దాన్ని చేయకుండుట పాపము. యాకోబు 4:17 - తప్పు జరిగించుట, దుష్టత్వము, దుర్నీతి, భక్తిహీనత, దుర్మార్గత మొదలగునవి పాపము.

## మొదటి పాపులెవరు?

1. మానవులలో మొదటి పాపులు ఆదాము హవ్వలు.
2. వారు దేవుని చిత్తాన్ని అతిక్రమించారు. ఆది 3:1-19 దేవుని శత్రువులయ్యారు.
3. నాటినుండి నేటివరకు మానవుడు పాపియే.

## పాపానికి కర్త యెవడు?

1. దేవుడు కాదు.
2. గాని సాతానుడే. ఆది 3:1-19
3. సర్పము హవ్వను మోసం చేసింది. 2 కొరి 11:3 - పాపంలో పడవేసింది.
4. అపవాది మానవజాతి శత్రువు.

## పాపులకు తండ్రి యెవడు?

1. అపవాది. యోహాను 8:34-44
2. అపవాది సంబంధులు అతని సేవ చేయుదురు. యోహా 8:43

## పాపమువలన అపరాధులెవరు?

1. అందరు పాపము చేసిన వారే. రోమా 3:23
2. మాలో పాపము లేదను వారు అబద్ధికులు. 1 యోహా 1:8-10
3. అందరు పాపులే. రోమా 5:8-12

## మానవుడెందుకు పాపము చేస్తాడు ?

1. వివిధ కోరికలు ఆశలు శోధనలోనికి నడిపిస్తాయి. యాకో 1:14; 4:1-4
2. తనకు లేనిదాన్ని మానవుడు పొందాలని ఎల్లప్పుడు కోరుచునే యుంటాడు.
3. శోధనకు లొంగి మానవుడు పాపంచేస్తాడు. 1 యోహా 2:16

## ముగింపు :

1. పాపము ఒక ఘోరమైన జబ్బు.
2. పాపమువలన వచ్చు జీతం మరణం. రోమా 6:23.
3. పాపానికి విరుగుడు యేసుక్రీస్తే.
4. ఆయన యిచ్చు నిత్య జీవాన్ని అందరం పొందుదుముగాక. యోహాను 8:24; లూకా 13:3, అపొ.కా. 2:38. ★

---

Regd. No. H/KD—45/KD.H.O.

*From*
SATYA WAKKU
P.O. Box. 80
KAKINADA-533 001

No.

To

..............................

..............................

..............................

..............................